## మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లల పంపిణీ



**కేసముద్రం/ప్రజాపక్షం:**2025–26 సంవత్సరానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ ద్వారా అందిస్తున్న చేప పిల్లలను గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కేసముద్రం ఎంపిడిఓ క్రాంతి మండలంలోని వివిధ గ్రామ, మత్స్య సహకార సంఘాలకు పంపిణీ చేశారు. మండలంలోని 34 చెరువులు, 35 నుండి 40 వరకు కుంటలకు కలిపి మొత్తం 12 లక్షల 19 వేల 800 చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ ఇన్స్పెక్టర్ దామెర శ్రీనివాస్, ముదిరాజ్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



# పథకంను మార్చడమంటే పేదల పొట్ట కొట్టడమే

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు డిమాండ్



**ప్రజాపక్షం/మెదక్:** పేదలకు ఉపాధి కల్పించాలనే మంచి ఉద్దేశ్యంతోకాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో యూపిఏ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని తీసుకొచ్చి పని కల్పిస్తే దానిని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం లోని మోదీ సర్కార్ కుట్ర చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు మండిపడ్డారు.పథకంను మార్చడమంటే పేదల పొట్టకొట్టడమేనని విమర్శించారు. పార్టీ పిలుపు మేరకు బుధవారం జిల్లా అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్ రావు, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరునే కాకుండా, దాని ఆత్మ, అమలు విధానాన్ని మార్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించాలనే మహాత్మా గాంధీ ఆలోచనలకు విరుద్ధంగా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటున్నదని, ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నదని అన్నారు. పేదలు, రాష్ట్రాలను శిక్షించేలా కేంద్రం విధానం ఉన్నదని అన్నారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ (గ్రామీణ్) (వీబీజీరామ్ జీ)గా మార్చే బిల్లును ఎమ్మెల్యే రోహిత్ రావు తప్పుబట్టారు. గ్రామీణ పేదలకు జీవనోపాధి భద్రత కల్పించడం, వలసలను తగ్గించడం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధిని సాధించడంలాంటి గొప్ప లక్ష్యాలతో నాటి యూపీఏ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ చారిత్రక పథకాన్ని నిర్వీర్యం చేయాలనే దురుద్దేశంతోనే కేంద్రం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. గతంలో వంద శాతం నిధులు వెచ్చిస్తూ పథకాన్ని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం, ఇప్పుడు తన వాటాను 60 శాతానికి తగ్గించి, మిగిలిన 40శాతం భారాన్ని రాష్ట్రా లపైమోపడం అన్యాయమన్నారు. ఇది రాష్ట్రాల ఆర్థిక స్థితిపై తీవ్రప్రభావం చూపే నిర్ణయమని, కేంద్రం తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నమేనని విమ ర్శించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పూర్తి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ అతి జోక్యంతో ఇప్పటికే నిధుల లేమితో అల్లాడుతున్న చాలా రాష్ట్ర ప్రభుత్వాలు ఈ చట్టాన్ని అమలు చేయకుండా ఎత్తేసే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులు ఉన్న సమయంలో 60 రోజుల పాటు ఉపాధి హామీ పనులను ఆపటం వల్ల కూలీలు పనికోల్పోయే అవకాశం ఉంటుందని ఎత్తిచూపారు. **చట్టానికి ఉన్న మహాత్మాగాంధీ పేరును తొలగించి ఇప్పుడు వికసిత్:** భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గార్ అండ్ అజీవిక మిషన్ గ్రామీణ్ (విబి జి రాంజీ)గా మార్చడాన్ని తప్పుబట్టారు. ఉపాధి హామీ పని దినాలను 200కి పెంచాలనీ, రోజుకూలిని రూ.307 నుంచి రూ.600 వరకు పెంచడంతో పాటు ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లును తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుప్రభాత్ రావు, శ్రీనివాస్ చౌదరి, సాన సత్యనారాయణ జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పబ్బతి ప్రభాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు హాఫిజ్ మొల్సాబ్, రమేష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ముత్యం గౌడ్, తొడుపునూరి శివరామ కృష్ణ, లక్ష్మీనారాయణ గౌడ్, లింగం, సరాఫ్ యాదగిరి, ప్రభాకర్, నాగరాజు హరిత, అశ్విని, గోదల జ్యోతి, తిరుపతి రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పరుశరామ్ నియోజకవర్గ అధ్యక్షులు భరత్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మందుగుల గంగాధర్, శంకర్, బెండేల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ ధ్యాన మహోత్సవంలో

# అందరూ పాల్గొనాలి



### కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** ఈ నెల 21న నిర్వహిస్తున్న ప్రపంచ ధ్యాన మహోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం హార్ట్ ఫుల్ నెస్ యోగ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మెడిటేషన్ డే వాల్ పోస్టర్ ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డిసెంబర్ 21 న సాయంత్రం 8 గంటలకు ప్రపంచ శాంతి కోరుతూ ధ్యానంలో కూర్చోవడం శుభ పరిణామం అన్నారు. ఒకే రోజు ఒకే సమయంలో లక్షలాదిమంది ఒకే ఆలోచనతో ధ్యానించడం మూలంగా ప్రపంచశాంతి నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా నోడల్ కోఆర్డినేటర్ బొంగాని లక్ష్మణ్, ఎస్ఎన్పీ మంతెన సమ్మయ్య, యోగా ట్రైనర్ విష్ణు, అభ్యాసులు మాధవరెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ సర్కార్ గద్దెదిగడం ఖాయం

### బిజెపి కార్యాలయం ముట్టడిలో ఎమ్మెల్యే మురళి నాయక్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** కేంద్రంలో మోదీ బిజెపి సర్కార్ గద్దె దిగడం ఖాయమని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్, జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని బిజెపి కార్యాలయాల ముట్టడిలో కార్యక్రమంలో మహబూబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాజీ డిసిసి అధ్యక్షులు తో పాటు జిల్లా నాయకులు, మండల నాయకులు, భారీగా వివిధ గ్రామాల సర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో బిజెపి కార్యాలయానికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోగా రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళి నాయక్, భరత్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో కార్మిక కర్షక విద్యారంగ వ్యవస్థలను పట్టించుకోని బిజెపి పార్టీ స్వయం ప్రతిపత్తి కలిగిన కేంద్ర దర్యాప్తు సంస్థలను బిజెపి జేబు సంస్థలుగా వాడుతున్నారనీ సోనియాగాంధీ, రాహుల్ గాంధీ లపై అక్రమ కేసులు పెడుతున్నారని ధ్వజమెత్తారు. దేశ ప్రజలు మోదీ ప్రభుత్వం పై విరక్తి చెందారని పేద మధ్యతరగతి ప్రజలు వ్యతిరేకిగా బిజెపి పార్టీ మిగిలిపోతుందనీ వారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక సోనియాగాంధీ, రాహుల్ గాంధీ పై బిజెపి ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయిస్తున్నారని వారు ఆరోపించారు. గత పదేళ్ల బిజెపి పాలనలో ఒక కుటుంబమైన అభివృద్ధి చెందిందా అని ప్రశ్నిస్తూ బిజెపిపై మండిపడ్డారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ దేశ ప్రజల కోసం ఎన్నో త్యాగాలు చేశారని, రానున్న రోజుల్లో రాహుల్ గాంధీని ప్రధాని కావాలని దేశ ప్రజలు ప్రతి ఒక్కరు ఆకాంక్షిస్తున్నారని వారు స్పష్టం చేశారు. బిజెపి పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతుందని దేశ ప్రజలు మేలుకోకపోతే దేశం పెట్టుబడి దారి చేతుల్లో విచ్ఛిన్నమవుతుందని ఎమ్మెల్యే మురళి నాయక్ యువతను, ప్రజలను మేల్కొల్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు జిల్లా నాయకులు ఘనపురపు అంజయ్య, శంతన్‌రామరాజు, పోతురాజు, రవినాయక్, మండలాల నాయకులు సర్పంచ్‌లు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై కాంగ్రెస్ గర్జన

**ప్రజాపక్షం/సంగెం:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ మరియు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పిలుపు మేరకు నేడు గీసుకొండ మండలం ధర్మారం సమీపంలోని కోటగండి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించారు. గవిచర్ల గ్రామ సర్పంచ్ బాషిపాక సదయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలపై రాజీలేని పోరాటం చేస్తామని ఉద్ఘాటించారు. ఈ నిరసన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అచ్చ నాగరాజు, ఉప సర్పంచ్ గుమ్మడి సంపత్, సురేందర్ గౌడ్, సోషల్ మీడియా ఇన్చార్జి మెహబూబ్ పాషా, వార్డు సభ్యులు బాషిపాక అశోక్, వెల్దండ భాస్కర్, బాషిపాక రాజేష్, కర్ధూరి చిన్న రాజు, రావుల రామకృష్ణ, హరికృష్ణ, పోశాల కిషోర్, కాజా పాషా, వేల్పుల ఏలియా, ప్రేమ్ రాజ్, యారా రఘు, ముకుందం, చిన్న తదితరులు పాల్గొని తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

## స్థానిక ఎన్నికల్లో ఫలించిన బీజేపీ నాయకుల కృషి

**ప్రజాపక్షం/ఆత్మకూరు :** పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలం చౌల్లపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు విజయం సాధించిన మోరే రాజేశ్వరరావుకు వార్డు మెంబర్లు, దామెర మండలం పసరగొండ గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికలు విజయం సాధించిన కొట్టే శ్రీవాణి రమేష్, వార్డ్ నెంబర్లకు శాలువాలతో సత్కరించి బిజెపి రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, జిల్లా అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మా రెడ్డి, 60 డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ మంద ఐలయ్య, మంద రమేష్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన సర్పంచ్ వార్డ్ మెంబర్ల విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు ప్రధాని నరేంద్రమోదీ తోనే దేశ ప్రగతి సాధ్యమని ఈ విషయం పల్లెవాసులు గుర్తించారని, అందుకే విజయం కట్టబెట్టారన్నారు. ఇదే ఉత్సాహంలో రానున్న ప్రతి ఎన్నికల్లో గెలిపి లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు.ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి నాయకులు అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారని, కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించడంలో సఫలమయ్యారన్నారు. దీనికి అభ్యర్థుల చరిష్మ కూడా తోడయిందని వెల్లడించారు. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలతోనే గ్రామాల్లో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని పేర్కొన్నారు.

## సర్పంచ్ సమ్మిరెడ్డికి ఘన సన్మానం

**ప్రజాపక్షం/మహాదేవపూర్:** మండలంలోని కుదురుపల్లి గ్రామ సర్పంచ్‌గా గెలుపొందిన చల్ల సమ్మిరెడ్డిని గరువారం జిల్లా గ్రందాలయ చైర్మెన్ కోట రాజబాబు,సీనియర్ నాయకుడు కట్కం అశోక్,నాయకుడు బుర్రి శివరాజ్ శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సహాకారంతో గ్రామ ప్రజల సమస్యలను పరిశ్కరించాలని అన్నారు.

## నెక్కొండ మండలంలో బలపడిన కాంగ్రెస్

**ప్రజాపక్షం/నెక్కొండ:** నెక్కొండ మండల రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ తిరుగులేని శక్తిగా ఎదుగుతున్న సంకేతాలు స్పష్టం కనిపిస్తున్నాయి. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బక్కి అశోక్ కుటుంబం నుండి బక్కి కవిత సర్పంచ్‌గా ఘన విజయం సాధించడం కాంగ్రెస్ శిభిరానికి మరింత ఉత్సాహాన్ని నింపింది. మాజీ జడ్పిటిసి అయిన బక్కీ కవిత ప్రజల్లో ఉన్న అనుబంధం, పార్టీపై నమ్మకం ఈ విజయానికి ప్రధాన కారణంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మండలంలో కీలకమైన మేజర్ గ్రామ పంచాయతీ నెక్కొండను కూడా కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోవడం విశేషం. అలాగే మండలంలో పెద్ద గ్రామాలైన చంద్రుగొండ, అలంకానిపేట, అప్పలరావుపేట, నాగారం ఇలా పెద్ద పెద్ద గ్రామాలను సైతం కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. ఈ ఎన్నికలలో బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు సంఘని సూరయ్య ఓటమి చెందడం బిఆర్ఎస్‌కు పెద్ద ఎదురు దెబ్బగా మారింది. అలాగే నెక్కొండ మేజర్ గ్రామ పంచాయతీలో బిఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచిన న్యాయవాది, సీనియర్ నేత కొమ్ము రమేష్ యాదవ్ పరాజయం కూడా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. మొత్తంగా చూస్తే ఈ ఎన్నికలు నెక్కొండ మండలంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయని స్పష్టంగా సూచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ప్రజాభిప్రాయం మలుపు తిరుగుతుండగా, ప్రతిపక్షాల ప్రభావం క్రమంగా తగ్గుతున్నట్లు కనిపిస్తోంది. వివిధ గ్రామాల్లో స్వల్ప మెజార్టీతో గెలిచిన ప్రతిపక్ష సర్పంచ్‌లు సైతం త్వరలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి హామీల అమలుపై ప్రజలు కాంగ్రెస్‌ను విశ్వసిస్తున్నారనే విషయం ఈ ఫలితాల్లో ప్రతిబింబించింది. మండల రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ ఆదిపత్యం మరింత బలపడే దిశగా ఈ విజయం కీలక మైలురాయిగా నిలిచిందని చెప్పవచ్చును.

## నిలిచిపోయిన పాకాల ఆడిటోరియంను వెంటనే ప్రారంభించాలి

**ప్రజాపక్షం/నర్సంపేట:** నర్సంపేట పట్టణంలోని ఐదు కోట్ల నిధులతో 90 శాతం పనులు పూర్తి చేసి ఉన్న పాకాల ఆడిటోరియం ను వెంటనే పూర్తి చేసి ప్రారంభించాలని నర్సంపేట బిఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని పాకాల ఆడిటోరియం ఎదుట పట్టణ బిఆర్ఎస్ కమిటి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధి కొరకు మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ మున్సిపల్ మంత్రివర్యులు కేటీ రామారావు సహకారంతో కోట్లాది రూపాయల నిధులను తీసుకురావడం జరిగిందని, అందులో భాగంగా కొన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసి మరికొన్ని కార్యక్రమాలకు ఆనాటి మున్సిపాలిటీ పాలక మండలి చేత ప్రణాళిక రచించి తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. టియూఎఫ్ఐడిసి ద్వారా 42 కోట్ల నిధులను పట్టణంలోని అన్ని వార్డులలో



సమగ్ర అభివృద్ధి కొరకు సిసి రోడ్లు , డ్రైనేజీ, లాంటి మౌలిక సౌకర్యాలు కల్పించడానికి, పార్కు, ఆడిటోరియం, వెజిటేబుల్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ వెజిటేబుల్ మార్కెట్, మేజర్ డ్రైనేజీ, రింగ్ రోడ్డు, బస్తీదావాఖన లాంటి, జంక్షన్ల అబివృద్ధి, సెంట్రీ లైటింగ్, లైబ్రరీ, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణ కార్యక్రమాల కొరకు నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మనోహర్ రెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, బిఆర్టియూ జిల్లా అధ్యక్షులు, మాజీ మండల అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్స్, మైనార్టీ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశాలకు పెండింగ్ పారితోషికాలు వెంటనే చెల్లించాలి



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** గత ఐదు సంవత్సరాల నుండి ఆశాలకు లెప్రసి, పల్స్ పోలియే, టిబి, డీ వార్మింగ్, ఎగ్జాం, ఎన్నికల డ్యూటీలకు సంబంధించి బకాయి పారితోషికాలు చెల్లించాలని లేకి యెడల ఎలాంటి కొత్త సర్వేలను చేయబోమని గురువారం వరంగల్ జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయాన్ని సిఐటియూ ఆధ్వర్యంలో ఆశాలు ముట్టడించారు. ఈ ముట్టడి కార్యక్రమానికి ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చినగారి రాణి అధ్యక్షత వహించగా సిఐటియూ రాష్ట్ర కార్యదర్శి కాసు మాధవి మాట్లాడుతూ సమాజంలో చాపకింద నీరులా లెప్రసీ, టిబి వంటి అంటు వ్యాధులు ప్రబలుతుంటే వాటిని అడ్డుకట్ట వేయడంలో ఆశా కార్యకర్తలు ఫ్రట్ లైన్, గ్లోబల్ హెల్త్ లీడర్స్‌గా ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా ఇలాంటి అత్యంత ముఖ్యమైన పనులు చేసినందుకు రావాల్సిన పారితోషికాలను ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచడం సరైంది కాదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, ఆశా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీనపెల్లి చైతన్య, కోశాధికారి సుజాత, ఉపాధ్యక్షులు రమ, సహాయ కార్యదర్శి పద్మలతో పాటు వివిధ పిహెచ్‌సిల నుండి ఆశాలు పాల్గొన్నారు.

## ధర్మశాస్త్ర ఆలయ కమిటీ దివ్య పడిపూజ మహోత్సవం

**ప్రజాపక్షం/నర్సంపేట:** శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయ ప్రాంగణం యందు ఆలయ సేవా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శింగిరకొండ మాధవ శంకర్ గుప్త ఆధ్వర్యంలో 25వ మండల పూజ మహోత్సవ వేడుకలలో రాజతోత్సవ వేడుకలు ఏర్పాటులో 35వ రోజు మహా అన్నా ప్రసాద కార్యక్రమంలో దాతలు అందరూ పాల్గొనగా దివ్య పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ ఆలయ ఏర్పాటూ నుండి ఇప్పటి అభివృద్ధి వరకు 500 రూపాయల సహాయం నుండి సహకరించిన దాతలు ప్రతి ఒక్కరికి కృతజ్ఞత భావనతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దేవిష్ మిశ్రా బృందం గురుస్వాములు అలంకరించిన ట్టాంబడి పై చేతులు వెలిగిస్తూ 18 కళాశాలపై తాంత్రిక పద్ధతిలో పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే నర్సంపేట అభివృద్ధినిధులలో 20 లక్షలు



దొంతి మాధవరెడ్డి ఆలయ అభివృద్ధికి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవ శంకర్ గుప్త, అధ్యక్షులు సైఫా సురేష్, ప్రధాన కార్యదర్శి చింతల కమలాకర్ రెడ్డి, కోశాధికారి దొడ్డ రవీందర్ గుప్తా, మాదారపు చంద్రశేఖరం, శ్రీరాం ఈశ్వరయ్య, దేవునూరి అంజయ్య, గోపికృష్ణ, రాధాకృష్ణ ఆగ్రో ఇండస్ట్రీస్, నూనె వెంకటలక్ష్మి, చిలుక మౌనిక, ఏకాంతం, మూడు విజయ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:** మండలంలోని బండ్ల గూడెం గ్రామంలోని గల, కస్తూర్బా గాంధీ పాఠశాలను, జనగామ జిల్లా అదనపు కలెక్టర్, పింకేష్ కుమార్, గురువారం సందర్శించారు. అనంతరం వారు విద్యార్థిని లకు మౌలిక సదుపాయాల, పాఠశాల భవనాలు, తరగతి గదులు, హాస్టల్ వసతులు, శానిటేషన్ సదుపాయాలు, తాగునీటి, వంటశాల భద్రత, విద్యార్థి వసతి సౌకర్యాలపై సమీక్షించారు. విద్యార్థులకు, అవసరమైన మరమ్మతులు, మొదలకు పనుల గురించి సంబంధిత అధికారులు, తక్షణ చర్యలను తీసుకోవాలని ఆవారు ఆదేశించారు. అనంతరం జనగామ జిల్లా అదనపు కలెక్టర్, పింకేష్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలల్లో, ఆధునిక సైన్స్ ల్యాబ్ లు విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి దోహదపడతాయని వారు అన్నారు. కస్తూర్బా గాంధీ పాఠశాలలో బాలికలకు సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన వాతావరణం కల్పించడం, ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, మౌలిక, వసతుల పరంగా, ఇలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో, వివిధ శాఖ అధికారులు, మండల్ ఎంఈఓ, విష్ణుమూర్తి, కస్తూర్బా గాంధీ, ప్రిన్సిపల్, ఎన్ అన్నపూర్ణ, ఉపాధ్యాయురాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** వరంగల్ నగరంలోని శివనగర్ పాడి మల్లారెడ్డి నగర్‌కు చెందిన మిరియాల కృష్ణ రజిత దంపతుల 12 సంవత్సరాల కుమారుడు మిరియాల గౌతమ్ ఖిలా వరంగల్ చిల్డ్రన్స్ పార్క్‌ను చూడడానికి వెళ్ళి అక్కడ ఉన్న గుర్రం వద్దకు వెళ్ళగా గుర్రం తన్నడంతో ప్రమాదవశాత్తు గౌతమ్ మరణించారు. ఈ విషయం స్థానిక కాంగ్రెస్ నాయకులు శ్రీరాం రాజేష్, పగడాల సతీష్‌లు దృష్టికి స్థానికులు తీసుకెళ్ళగా వారు వారి కుటుంబాన్ని పరామర్శించి పేద వారైనా అట్టి కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా కొండా దంపతుల దృష్టికి ఇట్టి విషయాన్ని తీసుకొని వెళ్ళి వారి చేత కూడా తగిన సహాయ సహకారాలు అందిస్తామని మాట ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అక్షిత్ పటేల్, మన్యం సతీష్, సంఘని ప్రియదర్శిని, గడ్డం లత, స్థానికులు పాల్గొన్నారు.

## ఓటమిపై సంయమనం అవసరం

**ప్రజాపక్షం/నెక్కొండ:** మూడవ విడత స్థానిక సంస్థల ఎన్నికలలో వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని 34 గ్రామ పంచాయతీల్లో ఓటమి చెందిన సర్పంచ్ అభ్యర్థులు సంయమనం పాటించాలని వివిధ పార్టీల సీనియర్ నేతలు సూచించారు. ఓటమి అనంతరం ఓటర్లను తిట్టడం, ఇచ్చిన డబ్బులు తిరిగి వసూలు చేయడం వంటి చర్యలకు దిగితే నష్టం అభ్యర్థులకే జరిగే ప్రమాదముందని హెచ్చరించారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ఎంపిటిసి, జడ్పిటిసి, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో ప్రస్తుతం ఓడిపోయిన అభ్యర్థులు సహనం, సానుభూతితో ప్రజల్లో ఉంటే మరల గెలుపు దిశగా ప్రయాణించే అవకాశముందని సీనియర్ నేతలు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో ఓటమి శాశ్వత కాదని, ప్రజల మధ్య మంచి పేరు నిలబెట్టుకోవడమే భవిష్యత్ విజయాలకు బాట వేసేదని వారు సూచించారు.

## కుష్టివ్యాధిపై ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/వరంగల్ :** కుష్టివ్యాధిపై ఇంటింటి సర్వేను పకడ్భందిగా నిర్వహించాలని వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు అన్నారు. వరంగల్ లోని పైడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కుష్టివ్యాధి పై అవగాహన నిర్ధారణ ఇంటింటి సర్వే( ఎల్సిడిసి )ను ప్రారంభిస్తూ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటి సర్వే ద్వారా ఎవరికైనా శరీరం పైన మచ్చలు ఉంటే గుర్తించి అలాంటి వారి పేర్ల వివరాలను సేకరించి వైద్యాధికారి ద్వారా పరీక్షలు నిర్ధారించి కుష్టి వ్యాధి గనుక ఉన్నట్లు అయితే వారికి తగిన అవగాహన కల్పించి వ్యాధి పూర్తిగా నివారించడానికి చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు.

ప్రజలు స్వచ్ఛందంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహకరించి వారి శరీరం పై ఉన్న మచ్చలను చూపించినట్లయితే వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది వారి వివరాలను గోప్యంగా ఉంచి వారికి తగిన చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నేటి నుండి ఈనెల 31 వరకు ప్రతిరోజు ఉదయము 6:00 నుండి 9 గంటల వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రోగ్రాం అధికారి డాక్టర్ మోహన్ సింగ్, స్థానిక వైద్యాధికారి జునైద్ ఖాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐఎల్‌పిఎ రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/భూపాలపల్లి :** సామాజిక న్యాయం, న్యాయవాద హక్కులు, రక్షణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న ఇండియన్ లీగల్ ప్రొఫషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పిఎ) 5వ రాష్ట్ర మహాసభలకు భూపాలపల్లి జిల్లా న్యాయవాదులు పెద్ద ఎత్తున తరలి రావాలని భూపాలపల్లి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వలబోజు శ్రీనివాసాచారి పిలుపునిచ్చారు. 20న కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరుగు ఐఎల్‌పిఎ 5వ రాష్ట్ర సదస్సు గోడ పత్రికలను గురువారం భూపాలపల్లి కోర్టు ఆవరణలో విడుదల చేసి వారు మాట్లాడారు. ఐఎల్‌పిఎ రాష్ట్ర నాయకులు ఐఎల్‌పిఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయిని నరేందర్, పంచగిరి బిక్షపతి, మెరుగు రవీందర్, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బల్ల మహేందర్, లైబ్రరీ సెక్రటరీ అక్షయ, స్పోర్ట్స్ సెక్రటరీ ఇందారపు శివకుమార్, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ పార్టీకి దారుణ అవమానం!

**ప్రజాపక్షం/నెక్కొండ :** నెక్కొండ మండలంలో జరిగిన మూడవ విడత స్థానిక సంస్థ ఎన్నికలలో జాతీయ పార్టీ అన్న గర్వం సోషల్ మీడియాకే పరిమితమైందని తేలిపోయింది. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ఈ ఎన్నికలలో పోటీకి దిగినా, ప్రజల తీర్పు మాత్రం కరుణ చూపలేదు. డిపాజిట్ సంగతి అటుంచి..వంద ఓట్ల గడప కూడా దాటలేకపోయాడు. 2000 ఓట్లు వస్తాయని ఆశించి టికెట్ తెచ్చుకున్న అభ్యర్థికి వందలోపు ఓట్లు రావడం, జాతీయ పార్టీకి గ్రామ స్థాయిలో ఉన్న నిజమైన బలం ఏమిటో బట్టబయలు చేసింది. మేజర్ గ్రామ పంచాయతీలో ఈ ఫలితం. సోషల్ మీడియాలో జెండాలు ఎగురవేసిన పార్టీకి, పోలింగ్ రోజున ప్రజలు జెండా దించేసారు.

## నెక్కొండ నూతన సర్పంచ్‌కు ఘన స్వాగతం

**ప్రజాపక్షం/నెక్కొండ :** నెక్కొండ గ్రామ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన పెండ్యాల హరి ప్రసాద్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొట్లపల్లి వీరస్వామి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈదునూరి సాయి కృష్ణ, నేత సారంగపాణి, వనం ఏకాంతం, తాళ్లపల్లి భాస్కర్, తాటిపాముల వెంకన్న, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండలాధ్యక్షుడు రావుల తిరుపతిరెడ్డి, మునుకుంట్ల వెంకటేశ్వర్లు, గాంద్రకోట చెన్నకేశవులు, తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో ఘనంగా రుద్రహోమం

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** మాస శివ రాత్రి సందర్భంగా హనుమకొండలోని హనుమకొండ సాయిబాబా మందిరంలో భక్తిశ్రద్ధలతో రుద్ర హోమం మందిర పూజారులు కిషోర్ శర్మ, మణిశర్మ, చందులు ఘనంగా నిర్వహించారు. అలాగే ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగడంతో ఉదయం నుంచే మందిరానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి దర్శనాలు చేసుకున్నారు. మందిర చైర్మన్ మతుకుమల్లి హరగోపాల్ ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, పూస సురేష్ కుమార్, రాకం సదానందం, మందిర వైద్యులు ఆకుల వెంకటరమణయ్య దంపతులు తదితరులు పాల్గొన్నారు.

# యూనివర్సిటీని అమ్ముకున్న బిఆర్ఎస్ నేతలు



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** గత పది ఏళ్ల బిఆర్ఎస్ పాలనలో మానుకోట నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే మురళి నాయక్ విమర్శించారు. మానుకోట గడ్డలో నేను పుట్టినందుకు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి ఇక్కడ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి నాకు జన్మనిచ్చిన మానుకోట గడ్డ రుణం తీర్చుకోవాలన్నారు. సుమారు 409 ఎకరాల 1200 కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిలో రైల్వే డిపో నిర్మించేందుకు ప్రభుత్వం జీవో ఇచ్చిందని తెలిపారు. రైల్వే డిపో నిర్మాణంతో మానుకోటలో ప్రత్యక్షంగా 10,000 మంది నిరుద్యోగులకు, పరోక్షంగా మరో పదివేల మంది నిరుద్యోగులకు ఉద్యోగ ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే అన్నారు.. నియోజకవర్గ అభివృద్ధిని తాకట్టు పెట్టిన బిఆర్ఎస్ నాయకులకు, మాజీ ప్రజా ప్రతినిధులకు మహబూబాబాద్ ప్రజలు తగిన బుద్ధిచేపుతారని హెచ్చరించారు. నియోజకవర్గంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారు స్వచ్ఛందంగా తిరిగి ఇచ్చి అభివృద్ధికి సహకరించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే హెచ్చరించారు.ఈ సమావేశంలో డిసిసి మాజీ అధ్యక్షులు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, జిల్లా నాయకులు ఖలీల్, ఘనపురపు అంజయ్య పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో కష్టపడ్డ కార్యకర్తకు గుర్తింపు



**ప్రజాపక్షం/మంగపేట :** ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరు హేమచల కొండల్లో వెలసిన ప్రముఖ శైవ క్షేత్రం రెండవ యాదగిరిగుట్టగా ప్రసిద్ధిగాంచిన కలియుగ దైవం శ్రీ హేమచల శ్రీలక్ష్మి నృసింహ స్వామి చెంచులక్ష్మి ఆదిలక్ష్మి అమ్మవార్ల దర్శనానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో కమలాపురం గ్రామానికి చెందిన గుమ్మడి సోమయ్య కు తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి దణసరి అనసూయ సీతక్క చొరవతో మండల కాంగ్రెస్ పార్టీలో కష్టపడి 2001 లో కాంగ్రెస్ పార్టీ జెడ్పిటిసిగా 2006లో సర్పంచ్ గా పనిచేసిన ప్రస్తుతం ములుగు ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షునిగా క్రమశిక్షణకు మారుపేరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆదివాసీ ముద్దు బిడ్డా గుమ్మడి సోమయ్య కు పంచాయతీ రాజ్ శాఖ లో డైరెక్టర్ గా అవకాశం కల్పించిన సందర్బంగా మల్లూరు హేమచల గుట్టల్లో శ్రీ లక్ష్మి నృసింహ స్వామి ఆలయంకు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గుమ్మడి సోమయ్యతో వెళ్లి స్వామి వారి దర్శనం చేసుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్ట పడ్డ వారికీ తగిన గుర్తింపు దక్కుతుంది అని నిరూపించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి సీతక్కకు అలాగే జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడకుల అశోక్‌కు మండల కమిటీ తరుపున ధన్యవాదములు తెలిపారు. శ్రీ లక్ష్మి నృసింహ స్వామి దేవాలయం ఫేస్టివెల్ చైర్మన్ ఎర్రంగారి సురేష్ చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు ముత్తినేని ఆదినారాయణ సిద్ధంశెట్టి వైకుంతం పచ్చా శేషగిరిరావు అయ్యోరి యాణయ్య వల్లేపల్లి శివప్రసాద్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు కర్రీ నాగేంద్రబాబు ఎంపెల్లి వీరాస్వామి కొడేం బాలకృష్ణ కాంగ్రెస్ కర్తలు పాల్గొన్నారు.

# జనం మెచ్చిన నాయకుడు సర్పంచ్ మోహన్ రెడ్డి

### మంత్రి ఇలాకాలో భారీ మెజార్టీతో విజయ కేతనం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సర్పంచ్ ఎన్నికలు రసవత్తరంగా సాగాయి. మూడో విడత.బుధవారం జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి 1010 ఓట్ల మెజారిటీతో తన ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి మేంగాని అశోక్ పై విజయ దుందుభి మోగించాడు. హోరాహోరిగా ఎన్నికల కురుక్షేత్రంలో పోటాపోటీగా ప్రచారం చేయగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ఇలాకాలో అధికార పార్టీ అభ్యర్థిపై బిఆర్ఎస్ అభ్యర్థి మోహన్ రెడ్డి అనూహ్యంగా భారీ మెజారిటీతో విజయం సాధించడం గ్రామంలో సంచలంగా మారింది.కాంగ్రెస్ అభ్యర్థి అశోక్ అత్యల్పంగా 487 ఓట్లతో ఘోర పరాజయం పాలు కాగా బిఆర్ఎస్ అభ్యర్థి మోహన్ రెడ్డి 1497 ఓట్ల భారీ మెజారిటీతో విజయం కేతనం ఎగురవేయడం మండలంలో హాట్ టాపిక్ గా మారింది.బిఆర్ఎస్ అభ్యర్థి మోహన్ రెడ్డి భారీ మెజారిటీతో గెలుపును స్వంతం చేసుకోవడం కాంగ్రెస్ వర్గాలను సైతం విస్మయానికి గురిచేయడం గమనార్హం. ఘోర పరాజయం పాలైన అశోక్‌కు కాంగ్రెస్ శ్రేణుల ఓట్లు మాత్రమే రాగా కాళేశ్వరం గ్రామంలోని ఓటర్లంతా మోహన్ రెడ్డి, వైపున నిలిచి భారీ మెజారిటీతో విజయం సాధించి పెట్టాయి. మోహన్ రెడ్డి భార్య వసంత గతంలో సర్పంచ్ గా, ఎంపిపి గా పదవులు నిర్వహించగా తాజా స్థానిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో సర్పంచ్ గా గెలుపొందడం ఆయనకు ఆయనే సాటిగా నిలిచినట్లు చర్చించుకుంటున్నారు. కాళేశ్వరం గ్రామంలో అందరివాడుగా పేరున్న సర్పంచ్ మోహన్ రెడ్డి, జనం మెచ్చిన నాయకుడుగా జిల్లాలోనే అత్యధిక మెజారిటీ సాధించిన మొదటి వ్యక్తిగా నిలిచిపోవడం చర్చనీయాంశమైంది.

# అనాథ పిల్లలని అధైర్యపడవద్దు

### కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి

### బాల వికాస సంస్థ ప్రతినిధులు లత ప్రతాప్



**ప్రజాపక్షం/తొర్రూరు :** అనాథ పిల్లలని అధైర్యపడవద్దని కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని బాల వికాస సంస్థ ప్రతినిధులు లత ప్రతాప్, జ్యోతి, అమూల్య అన్నారు. పట్టణ కేంద్రంలోని లయన్స్ భవన్‌లో గురువారం బాల వికాస ఆధ్వర్యంలో అమ్మానాన్నలను కోల్పోయిన అనాథ విద్యార్థులకు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వికాస ప్రతినిధులు లతా ప్రతాప్, జ్యోతి, అమూల్యలు మాట్లాడుతూ బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనాథ పిల్లలని అధైర్యపడవద్దని జన వికాస అండగా నిలుస్తుందన్నారు. దాతల సహకారంతో అనాథ విద్యార్థులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామన్నారు. ఎన్నమనేని శ్రీదేవి శ్రీనివాసరావు, డాక్టర్ రాజు, సర్పంచ్‌లు నలుగురి రామలింగం, సంగీతా జగదీశ్వరాచారి, దుంపల శ్రీదేవి, ఈనెపల్లి భద్రమ్మ, యాసం సంధ్య, శకుంతల, సత్యవతిలు దాతలుగా నిలువగా బొమ్మనబోయిన రాజేందర్ యాదవ్, వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డిలు పిల్లలకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ వై.రమ, మెయిన్ కో ఆర్డినేటర్ ఎం.రమ, ఎం.శోభారాణి, ఎం.సరిత, తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా భగవాన్‌రెడ్డి

**ప్రజాపక్షం/ములుగు :** పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర డైరెక్టర్‌గా ములుగు జిల్లాలోని వెంకటాపూర్ మండల రామంజపూర్ గ్రామానికి చెందిన బైరెడ్డి భగవాన్‌రెడ్డి ఎన్నికయ్యారు. కాగా గురువారం ములుగు జిల్లా కేంద్రంలో బైరెడ్డి భగవాన్‌రెడ్డిని కాంగ్రెస్ నాయకులతో పాటు ములుగు జిల్లా జర్నలిస్టులు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భగవాన్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్‌గా అవకాశం కల్పించిన మంత్రి సీతక్కతో పాటు జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తన వంతు సహాయ సహకారాలను ములుగు జిల్లా ప్రజలకు అందిస్తానని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానని భగవాన్‌రెడ్డి అన్నారు. తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎల్లవేళలా ములుగు జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసుకుంటానని ఆయన తెలిపారు. తాను మొదటి నుండి కాంగ్రెస్ కార్యకర్తగా ఉంటూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని, తన సేవలను గుర్తించిన అధిష్టానం తనకు డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.



## కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

**ప్రజాపక్షం/తొర్రూరు :** కుష్టువ్యాధి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ చెప్యాల వనాకర్ రెడ్డి అన్నారు. కుష్టువ్యాధి నిర్మూలనే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నాంచారిమడూరు, డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సర్వే ఈ నెల 31 జరగనుంది. ఈ సర్వే కోసం డివిజన్ వ్యాప్తంగా 81మంది ఆశా కార్యకర్తలు, 22 మంది సూపర్‌వైజర్లు, ఒక నోడల్ ప్రతినిధి సర్వేలో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా డీపీఎంఓ మాట్లాడుతూ కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా అంగవైకల్యానికి దారి తీస్తుందని అన్నారు. ముందుగానే గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా అరికట్టడం సులువు అవుతుందన్నారు. కుష్టు వ్యాధి అరికట్టడం చాలా సులువుగా మారినా వ్యాధిగ్రస్తులపై ప్రజల్లో, కుటుంబ సభ్యుల్లో వారిపై చిన్నచూపు కనిపిస్తుందన్నారు. లేప్రసీ వ్యాధిని ఎండిటీ ద్వారా నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫీజు చెల్లించాలి

**ప్రజాపక్షం/తొర్రూరు :** డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ డిగ్రీ సెమిస్టర్ పరీక్షా ఫీజును ఈ నెల 27లోపు చెల్లించాలని అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.సునిల్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. తొర్రూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్రంలో డిగ్రీ 1,3,5వ సెమిస్టర్ పరీక్షా ఫీజులను ఈ నెల 27లోపు చెల్లించాలని అన్నారు.

## నారాయణరావుపేట పిహెచ్‌సి సెంటర్‌ను

# కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా నారాయణరావు పేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హైమావతి సందర్శించి రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిష్టర్,ఓపిలను చెక్ చేశారు. ఓపి రిజిష్టర్ సక్రమంగా నిర్వహించకపోవటంపై ఆసహనం వ్యక్తం చేశారు.

రికార్డు చక్కగా మెయిన్‌టెయిన్ చేయాలని,ఏదో మొక్కుబడిగా రాస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పిహెచ్‌సి మైనర్ రిపేర్లు త్వరగా పూర్తి చేయాలని,కంట్రాక్టర్‌తో మాట్లాడాలని మెడికల్ అధికారికి సూచించారు. పిహెచ్‌సిలో మెడిసిన్, వైద్య పరికరాలు ఇతరత్రా అన్ని ఉండేలా చూసుకోవాలని ,పిహెచ్‌సికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా మెడికల్ అధికారి, సిబ్బంది పనిచేయాలన్నారు. ఆనంతరం నారాయణరావుపేట గ్రామపంచాయతీలోని ఆయూష్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఆయూష్ కేంద్రంలో చేస్తున్న సేవలను గురించి ఆరా తీశారు. ఆయుష్ సేవలను విస్తరించాలని డాక్టర్‌కు తెలిపారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ జోరు

## బిఆర్ఎస్ వెనుకంజ



**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** జిల్లాలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు దారుల జోరు కొనసాగింది. మూడో విడత ఎన్నికల్లోను అత్యదిక సర్పంచ్ స్థానాలకు అధికార పార్టీ మద్దతుదారులే కైవసం చేసుకున్నారు. తొలి దశ ఎన్నికల్లోను 136 గ్రామ పంచాయతీలకు గాను కాంగ్రెస్‌కు 78 స్థానాలు, బీఆర్ఎస్‌కు 47 స్థానాలు, రెండవ దశ ఎన్నికలో మొత్తం 243 కి గాను 146 కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ గాను 98 స్థానాలు , మూడవ దశలో 234 గాను 167 కాంగ్రెస్‌కు 54 బీఆర్ఎస్‌కు స్థానాలు కైవసం చేసుకొన్నాయి.

**దీటుగా పోటీ ఇచ్చిన భారాస :**

జిల్లాలో జరిగిన మొదటి రెండో విడత పోరులో గట్టి పోటీ ఇచ్చిన భారాస మద్దతు దారులు మూడవ విడత లోను అదే ఒరవడి కొనసాగించారు. సంఖ్య పరంగా తగ్గిన గట్టి పోటీ ఇచ్చి 54 స్థానాలో గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే సంజీవ రెడ్డి ప్రాతినిద్యం వహిస్తున్న నారాయణ ఖేడ్‌నియోజకవర్గం పరిదిలో ఏడు మండలాల్లో ఆ పార్టీ మద్దతుదారులే 141 స్థానాలో గెలుపొందారు. ఇదే డివిజన్ పరిధిలోని జహిరాబాద్‌లో నియోజకవర్గంలని న్యాల్‌కల్ మండలంలో ఎన్నికలు కాంగ్రెస్‌దే పై చేయ్యి అయింది.

**ఖేడ్‌లో పట్టు నిలుపుకున్న కాంగ్రెస్ :**

నారాయణ ఖేడ్ నియోజకవర్గ పరిధిలో 223 పంచాయతీలున్నాయి. ఇందులో మెజార్టీ స్థానాలలో అధికార కాంగ్రెస్ మద్దతుదారులు గెలుపొందడంతో పార్టీ పట్టు నిలుపుకున్నారు. ఈ నియోజకవర్గంలో ఎంపి సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, వర్గాలుగా పార్టీ మద్దతు దారులు విడిపోయి పోటి చేసారు. కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్, మద్దతు దారులు మద్య పోరు సాగింది. దీంతో వర్గాల మద్య ఓట్లు చీలి కాంగ్రెస్ మద్దతు దారులు ఓటమి చెందే అవకాశం ఉందని నేతలు భావించారు. ఇందుకు విరుద్ధంగా ఫలితాలు వెలుపడ్డాయి.

## వివేకానంద కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

### మున్సిఫల్ కమిషనర్‌కు వినతి



**ప్రజాఫక్షం/పటాన్–చెరు :** ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని వివేకానంద కాలనీలో నెలకొన్న తాగునీటి కొరత తీవ్రమైన పారిశుధ్య సమస్యలపై మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్‌కు కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో ప్రస్తుతం ఐదు రోజులకు ఒక సారి మాత్రమే తాగునీటి సరఫరా జరుగుతుండంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. కనీసం రెండు రోజులకు ఒకసారి అయినా నీటి సరఫరా జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు మున్సిపల్ కమీషన్ ను కోరారు. అదే విధంగా కాలనీలో మురుగు నీటి పారుదల వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తూ దుర్వాసన వెదజల్లుతొందని పేర్కొన్నారు. దీంతో దోమల బెడద విపరీతంగా పెరిగి డెంగ్యూ,మల్లేరియా వంటి విషజ్వరాలు , వ్యాపిస్తున్నాయని అందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్న పిల్లలు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల పాలవుతున్నారని వినతి పత్రంలో వివరించారు. కాలనీలో రోడ్లపైన ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు అధికంగా పెరిగిపోయాయని వాటిని వెంటనే తొలగించాలని కాలనీ వాసులు కోరారు. అలాగే బ్లీచింగ్‌పౌడర్ చల్లడం శానిటైజేషన్ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నెలకు ఒకసారి నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై సానుకూలకంగా స్పందించిన మున్సిపల్ కమీషనర్ వెంకట కిషన్ సంబందిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు.

## శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప స్వాములు



**ప్రజాపక్షం/పాపన్నపేట :** పాపన్నపేటలోని అయ్యప్ప స్వాములు ఇరుముడి వేసుకొని శబరిమలైకి బయలుదేరారు. మండల కేంద్రం పాపన్నపేటలోని అయ్యప్ప స్వామి క్షేత్ర సన్నిధానంకు చెందిన అయ్యప్ప స్వాములు గురువారం ఇరుముడి కార్యక్రమం కనుల పండుగగా జరిగింది. అనంతరం అయ్యప్పలు శబరిమల అయ్యప్ప స్వామి దర్శనానికి బయలుదేరారు. 41 రోజుల పాటు కఠోరమైన దీక్షను నియమ నిబంధనలతో పాటించారు. జెండాకృష్ణ గురు స్వామి అయ్యప్ప స్వాములకు ఇరుముడి కట్టారు. 18 మెట్ల పూజ అనంతరం ఇరుముడి నెత్తిన ధరించారు. స్వాముల బంధువులు, మిత్రులు కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై స్వాముల ఆశీర్వాదాన్ని పొందారు.

## ఆలయంలో ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/రేగోడ్ :** మండల కేంద్రంలో మర్పల్లి శివాలయంలోని మాస శివరాత్రి సందర్బంగా ఆలయంలో ధనం సిద్దారెడ్డి దాంపతుల ఆధ్వర్వంలో ఆలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించిరు అనంతరం అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు




## తుదివిడత స్థానిక ఎన్నికలకు అన్నిరకాల భద్రత ఏర్పాట్లు పూర్తి

### జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్

**ప్రజాఫక్షం/సంగారెడ్డి :** మూడవ విడత స్థానిక ఎన్నికలలో భాగంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని 8 మండలాలో 207 గ్రామ పంచాయతీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ తెలియజేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని రకాల భ్ధత ఏర్పాట్లను చేయడం జరిగిందని సమస్యాత్మక సెన్సిటీవ్ పోలింగ్ కేంద్రాలను గుర్తించి నిఘా కట్టుదిట్టం చేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రజలు వివిద పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల పవర్తన నియమావళిని కచ్చితంగా పాటిస్తూ ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా మీ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల విధులలో అప్రమత్తంగా ఉండి ఏ చిన్న సమస్యల తలెత్తెనా వెంటనే సీనియర్ అధికారులకు సమాచారం అందించాలే కాని ఏలాంటి తొందరపాటు నిర్ణయాలను తీసుకోకూడదన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా పారదర్శకంగా జరిగేందుకు అన్ని శాఖలతో సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన తరువాత తిరిగి డీఆర్పీ సెంటర్‌కు వచ్చే వరకు పోలింగ్ సిబ్బందికి బ్యాలెట్ బ్యాక్సలకు రక్షణ కల్పించాలని సిబ్బందికి సూచించడం జరిగింది.

## టాస్‌లో కలసి వచ్చిన ఉపసర్పంచ్ పదవి



**ప్రజాపక్షం/శివ్వంపేట :** మండలంలోని పిల్లుట్ల గ్రామంలో బుధవారం జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికలలో గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ బీజేపీ పార్టీల మద్దతుతో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు బరిలోకి దిగారు. హోరాహోరిగా జరిగిన ఎన్నికలలో మూడవ వార్డు నుంచి బీఆర్ఎస్ మద్దతుతో కుమ్మరి నాగరాజు, కాంగ్రెస్ పార్టీ మద్దతుతో మంగళపర్తి స్వామి పోటీ చేయగా ఇద్దరికి సమానంగా 60 ఓట్ల చొప్పున రావడంతో అధికారులు టాస్ వేయగా అందులో స్వామి వార్డుసభ్యుడిగా విజయం వరించింది. ఇదిలా ఉండగా ఎన్నికల ఫలితాలలో ఐదు వార్డులు బీజేపీ, నాలుగు వార్డులు కాంగ్రెస్, ఒక్క వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపొందడం జరిగింది. ఉపసర్పంచ్ కోసం ఇరు పార్టీల వార్డు సభ్యులతో అధికారులు ఎన్నికలు నిర్వహించగా బీజేపీ తరుపున 5 మంది, కాంగ్రెస్ తరుపున నలుగురు వార్డు సభ్యులతో పాటు సర్పంచ్‌గా గెలుపొందిన బుర్ర మురళీగౌడ్ పాల్గొనగా సర్పంచ్‌తో కాంగ్రెస్ పార్టీకి సమానం ఓట్లు రాగా బీఆర్ఎస్ తరుపున గెలుపొందిన వార్డుసభ్యుడు తటస్తంగా ఉండడంతో చెరి సమానం ఓట్లు అయ్యాయి. ఇరు పార్టీల ఒప్పందం మేరకు అధికారులు టాస్ వేయడంతో మంగళపర్తి స్వామిని ఉపసర్పంచ్ పదవి వరించింది. అదృష్టమంటే టాస్‌తో గెలిచిన గొల్ల స్వామిదేనని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.



## దారి ఇలా.. రాకపోకలు ఎలా?

**ప్రజాపక్షం/రేగోడు :** రేగోడు మండల కేంద్రంలోని పోచారం నుండి టి. లింగంపల్లి మధ్యలో రోడ్డు అధ్వానంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు గత సంవత్సరాలు గడుస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు

# ఖరీఫ్ సీజన్‌కు రైతులను సన్నద్ధం చేయాలి: కలెక్టర్

### అయిల్‌పామ్ ప్లాంటేషన్ ఆశించినంత చేయకపోవటంపై అధికారులపై అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/సిద్దిపేట:** సిద్దిపేట జిల్లాలో ఈసంవత్సరం 6500 ఎకరాల లక్ష్యానికి 2998 ఎకరాల్లో సాంక్షన్‌కు 1536 ఎకారాల్లో మాత్రమే ప్లాంటేషన్ పూర్తి చేయటంపై జిల్లా కలెక్టర్ హైమావతి అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో అయిల్ ప్లాంటేషన్ ఆశించినంత స్థాయిలో పూర్తి చేయకపోవవటంపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఖరీఫ్ సీజన్ పూర్తయినందున రైతులు రబీ సీజన్‌కు సన్నద్ధం అయ్యేలోపు జిల్లాలోని ప్రతి ఒక్క రైతుని కలసి అయిల్‌ఫామ్ సాగు చేయటానికి ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని ఆదేశించారు. గురువారం సిద్దిపేట సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని




ఉద్యానవన, అయిల్‌ఫ్రైడ్ ,మైక్రోఇరిగేషన్ కంపెనీ అధికారులతో అయిల్‌ఫామ్ సాగు పెంపుపై జిల్లా కలెక్టర్ హైమావతి సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఇప్పటివరకు 13576 అయిల్‌ఫామ్ ఫ్లాంటేషన్ జరిగినట్లు తెలిపారు. ఈ వారం మొత్తం స్పెషల్ డ్రైవ్‌గా తీసుకొని ఒక ప్రణాళిక ప్రకారం ప్రతి గ్రామంలో రైతులతో సమావేశాలు నిర్వహించి మీకు ఇచ్చిన టార్గెట్ తప్పనిసరిగా చేరుకోవాలని, ప్రతిరోజు పనితీరును పర్యావేక్షణ చేయాలని డిఎచ్ఓ సువర్ణని ఆదేశించారు.గ్రామాల్లో సమావేశాల్లో రైతులతో వారికి ప్రోత్సాహం సక్సెస్ స్టోరీలు, అయా జిల్లాలో అయిల్ ఫామ్ సాగుచేస్తున్న వ్యవసాయక్షేత్రాలను చూసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అడ్మినిస్ట్రేషన్‌శాంక్షన్ ఇచ్చిన రైతులు త్వరగా ఫిట్టింగ్ ప్లాంటింగ్ చేయాలని తెలిపారు. అలాగే డ్రిప్ డిడి సైతం కట్టించి డ్రిప్ పెట్టించాలని తెలిపారు. అయిల్‌ఫామ్ సాగు లాభాదాయకం అని రెండు సంవత్సరాల వరకు అంతర పంటలు వేసుకోవచ్చు అని, మూడవ సంవత్సరం నుండి అయిల్‌ఫామ్ గెలలు వస్తాయని నాలుగోసంవత్సరం నుండి పంట వస్తుందని రైతులకు ఒక నమ్మకం కలిగించేలా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలన్నారు. ఆయిల్‌ఫామ్ కర్మాగారం మన జిల్లాలో ఉన్నందున ఎక్కువ మొత్తంలో అయిల్‌ఫామ్ ప్లాంటేషన్ చేయించాలని విధులో నిర్లక్ష్యం భవిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

## బిజెపి కార్యాలయం ముందు కాంగ్రెస్ నేతల ధర్నా



**ప్రజాపక్షం/ సిద్దిపేట:** నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై అక్రమంగా తప్పులు కేసులు పెట్టినందుకు సుప్రింకోర్టు మొట్టికాయలు వేసినందుకు..పదేండ్లుగా కక్ష సాధింపు చర్యలకు పాల్పడినందుకు బిజెపి జిల్లా కార్యాలయం ఎదుట జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి బిజెపి జిల్లా కార్యాలయం ముట్టడికి యత్నించారు. పోలీసులు కాంగ్రెస్ నేతలను అడ్డుకొని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా డిసిసి అధ్యక్షురాలు అంక్షారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈడి,ఐటి లాంటి సంస్థలను వారి సొంతసంస్థలుగా మార్చుకొని వాటితో ప్రతిపక్ష నేతలను ఇబ్బందిపెట్టటానికి వాడుకుంటూ ప్రభుత్వ సంస్థలను బిజెపి దుర్వినియోగం చేస్తుందని విమర్శించారు. కేంద్రం ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకుంటే కాంగ్రెస్ మరింత తీవ్రంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు తాడూరి శ్రీనివాస్, దరిపల్లి చంద్రం, సూర్యవర్మ, బుచ్చిరెడ్డి, నాయిని నర్సింహరెడ్డి, సర్దార్‌ఖాన్, మోహన్, శ్రీధర్. రాజశేఖర్‌రెడ్డి, ఆజాద్, ఎల్లవ్వ. వంగరి నాగరాజు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన నూతన సర్పంచ్

**ప్రజాపక్షం/బెజ్జంకి:**మండల పరిధిలోని గాగిళ్ళాపూర్ గ్రామ నూతన సర్పంచ్‌గా ఎర్రల జానకి రాజు ఎన్నికైన సంధర్భంగా గురువారం స్థానిక ఎంఎల్‌ఏ డా.కవ్వంపల్లి సత్యనారాయణను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం నూతన సర్పంచ్,ఉప సర్పంచ్‌లను అభినందించి శాలువాతో సత్కరించారు.వీరి వెంట మార్కెట్ కమిటీ చైర్మెన్ పులి కృష్ణ,శ్రీనివాస్, ఒకర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పురుగు మందు సేవించి ఒకరు మృతి

**ప్రజాపక్షం/పాపన్నపేట:**పురుగు మందు సేవించి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొత్తపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన బైకనీ శ్రీనివాస్ (38) ప్రైవేటు డ్రైవర్ గా పని చేసేవాడు. కొన్ని నెలల క్రితం జరిగిన ఓ ప్రమాదంలో కాలు విరిగి ఇంటి వద్దే ఉంటున్నాడు. కాలు విరిగిందని ఏ పని చేయలేక పోతున్నానని తరచూ ఇంట్లో బాధ పడుతుండేవాడు. మనస్తాపం చెందిన అతను జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లో నుంచి పొలం వద్దకు వెళ్లాడు. పురుగు మందు సేవించి అవస్థ పడుతుండగా స్థానికులు గమనించి చికిత్స కోసం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి సమయంలో మృతి చెందాడు. మృతుడి భార్య ఎలీషా ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## పొన్నాల ఉప సర్పంచ్ సృజన సంపత్‌కు సన్మానం

**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** పంచాయతీ ఎన్నికల్లో నూతనంగా పొన్నాల గ్రామ ఉప సర్పంచ్‌గా ఎన్నికైన దారబోయిన సృజన సంపత్ యాదవ్‌ను గురువారం సిద్దిపేటకు చెందిన మిత్ర బృందం ఘనంగా సన్మానించారు. సృజన సంపత్ యాదవ్‌ను సన్మానిస్తున్న మిత్రులు ఓటు హక్కు వినియోగించుకున్న తిరిగే తీర్పు ఇచ్చారని ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా మిత్రుడు ఉపసర్పంచ్‌గా ఎన్నిక కావడం చాలా సంతోషం అని, పదవికి వన్నె తెచ్చే విధంగా కృషి చేయాలని, పనులు నిర్వహిస్తనని భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రచార గీతాం ఆవిష్కరణ



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే సత్యయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రచార గీతాన్ని స్వయంగా రచించి, స్వరకల్పనా సమకూర్చిన. గీతా ఆవిష్కరణ జిల్లా పరిషత్ పాఠశాల ముస్లాపూర్ ప్రాంగణం లో గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, ప్రభుత్వ కళాశాల లో కొనసాగుతున్న ప్రత్యేక కార్యక్రమల గురించి వివిధ పాఠశాల లకు ప్రచారం కొరకు వెళ్ళినప్పుడు మాట రూపం లో చెప్పటం కంటే అదే పాట రూపం లో వినిపిస్తే బాగుంటుంది అనే ఆలోచన తో నేను ఈ గీతాన్ని రాయటం జరిగింది అని తెలిపారు. పదవ తరగతి పాస్ అయ్యేక ప్రతి విద్యార్థి మా కళాశాల లో చేరాలని ముస్లాపూర్ పాఠశాల విద్యార్థుల ను కోరారు. మీ ఆవరణలో మీ ప్రధాన ఉపాధ్యాయుల చేతుల మీద పాట ఆవిష్కరణ చేయడం సంతోషకరమన్నారు. ప్రధానోపాధ్యాయులు రమేష్ మాట్లాడుతూ, ఇలాంటి సృజనత్మక ఆలోచనలు గల వ్యక్తులు అరుదుగా సమాజం లో ఉంటారని తెలిపారు. ప్రిన్సిపాల్ సత్యయ్య హిందీ అధ్యాపకులు అయినప్పటికి ని కళాశాల అభివృద్ధి కి ఉపయోగ పడే విదంగా తెలుగు లో పాట రాసి స్వరకల్పన సమాకుర్చటం అభినందనలు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో కళాశాల అధ్యాపకులు సి నరసింహ రెడ్డి, ఉపాధ్యాయులు యాదయ్య, జనార్దన్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రక్రియ విజయవంతం చేసిన అందరికీ అభినందనలు

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/మెదక్:**పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లోనూ విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అధికారులకు, ఎన్నికల విధులలో పాల్గొన్నా ఉపాధ్యాయులకు, పోలింగ్ సిబ్బందికి, పోలీస్ శాఖకు అందరికీ మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అభినందనలు తెలిపారు. జిల్లాలో మూడు దశలుగా నిర్వహించిన గ్రామ పంచాయితీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సజావుగా పూర్తవడం ప్రజల సహకారం వల్లనే సాధ్యమైందని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసే విధంగా ప్రజలు చూపిన బాధ్యతాయుత ప్రవర్తన ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో నిర్వహించిన సాధారణ గ్రామ పంచాయితీ ఎన్నికల పోలింగ్ విజయవంతంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యిందని అన్నారు.జిల్లాలో మొత్తం మూడు దశల్లో జరిగిన పోలింగ్ ను కలుపుకొని 89 శాతం ప్రజలు పోలింగ్లో పెద్ద ఎత్తున పాల్గొని జిల్లాను రాష్ట్రంలో ఐదవ స్థానంలో నిలపడం గర్వించదగ్గ విషయమన్నారు. ఎన్నికలు విజయవంతం చేయడంలో సహకరించిన అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి, పోలీస్ యంత్రాంగానికి, పాత్రికేయులకు అలాగే శాంతియుతంగా ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా ప్రజలందరికీ కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈనెల 22వ తేదీన గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు మెంబర్లుగా గెలుపొందిన అభ్యర్థుల పదవి ప్రమాణ స్వీకరా కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

## బిఆర్ఎస్‌లో 40 శాతం సర్పంచ్‌ల గెలుపు



**ప్రజాపక్షం/మెదక్ :**స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 40 శాతం సర్పంచ్ లు గెలవడం గొప్ప విషయమని, వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మేమే బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతామని, ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పల్లె ప్రజలు దిమ్మ తిరిగే తీర్పు ఇచ్చారని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఎద్దేవా చేశారు. మెదక్ నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలిచిన సర్పంచ్ ల సన్మానం మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి,సీనియర్ నాయకులు దేవేందర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, మల్లికార్జున్ గౌడ్ లు పాల్గొన్నారు. గెలిచిన సర్పంచ్ లను, ఉప సర్పంచ్ లను మాజీ మంత్రి హరీష్ రావు సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారంలో ఉన్న కాంగ్రెస్ కు పోటీగా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవడం మామూలు విజయం కాదన్నారు. ఎప్పుడైనా ఏ రాష్ట్రంలోనైనా రూలింగ్ పార్టీ సర్పంచ్ లు 80 నుంచి 90 శాతం గెలుస్తారని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉంటే బీఆర్ఎస్ పార్టీ 40 శాతం సర్పంచ్ లు గెలవడం గొప్ప విషయంగా చెప్పారు. అంటే ఇది దేనికి సంకేతమని..? ఒకవైపు రేవంత్ రెడ్డి కాలికి బలపం కట్టుకొని తిరిగి, ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ జిల్లా జిల్లాలు తిరిగిండని, అయినా కూడా జనం బండకేసి కొట్టారన్నారని విమర్శించారు.

## ఎస్టియూ నూతన క్యాలండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/మెదక్:** ఎస్టియూ మెదక్ జిల్లా 2026 నూతన సంవత్సర క్యాలండర్ ను జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్,జిల్లా విద్యాధికారి విజయ ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నరేష్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, ఎస్టీయూ సంఘ బాధ్యులు పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించడం కోసం సహకరించినందుకు అభినందనలు తెలియజేశారు. జిల్లా విద్యాధికారి విజయ మాట్లాడుతూ, వచ్చే పదవ తరగతి పరీక్షలలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమ లో రాష్ట్ర బాధ్యులు పోచయ్య,ఎర్ర రాజు జిల్లా ఆర్థిక కార్యదర్శి కిష్టయ్య జిల్లా బాధ్యులు నర్సింగ్, భూపతిగౌడ్, బాలకృష్ణ, శివప్రసాద్, వేణుగోపాల్, గొర్రె శ్రీనివాస్, అరుణ్ కుమార్, దుర్గారాములు, ఎల్లం, బాలమల్లేష్, రావి నాయక్, నర్సాగౌడ్, శ్రీకాంత్, రాజు, ప్రేమ్ కుమార్, నారాయణ, మహేశ్వర్, రవి, మహేష్, జబ్బార్, మహేష్ చారి, శ్రీనివాస్, నర్సిములు, గోపాల్, వసంత్,ఆయాజ్ మెదక్ పట్టణ అధ్యక్షులు దిలీప్ కుమార్, ప్రధాన కార్యదర్శి రత్నాకర్ వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/అల్లాదుర్గం:**మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం ముస్లాపూర్ శివారులోని పావురాల గుట్ట వద్ద గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. సుమారు పది రోజుల క్రితం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానిస్తున్నారు. అటుగా వెళ్లిన గ్రామస్తులు చెట్టుకు వేలాడుతున్న కుళ్లిపోయిన మృతదేహం చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్ఐ గాలయ్య తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు ముసలాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి శేఖర్ గా గుర్తించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థ ఎన్నికల్లో మొదటి విడత తన స్వగ్రామానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారని స్థానికులు తెలిపారు. అతని వృత్తికి గల కారణాలు తెలియాల్సిందని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.